# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7

తమిళనాడు

TAMILNADU

శుక్రవారం 11 అక్టోబరు 2024




## విజయదశమి శుభాకాంక్షలు

ఆంధ్రజ్యోతి పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులందరికీ విజయదశమి శుభాకాంక్షలు. తమిళనాట శుక్రవారం పండుగ జరుగనున్న కారణంగా చెన్నై కార్యాలయానికి సెలవు. అదే విధంగా తెలుగురాష్ట్రాల్లో శనివారం విజయదశమి సందర్భంగా ఆ రోజు సెలవు. అందువల్ల తమిళనాట ఆంధ్రజ్యోతి సంచిక శని, ఆదివారాల్లో వెలువడదు. పునర్దర్శనం సోమవారం.





పూక్కడై మార్కెట్లో పూలు, అరటి మొక్కల దుకాణాల వద్ద రద్దీ - బొరుగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

### ఆయుధపూజకు

# సర్వం సిద్ధం

## బజారు వీధులన్నీ జనమయం

● జోరుగా పూజాసామగ్రి అమ్మకాలు



కొనుగోలు దారులతో కళకళలాడుతున్న మార్కెట్

ప్యారీస్, అక్టోబరు 10: ఆయుధపూజ, విజయ దశమి వేడుకలకు ప్రజలంతా సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమ్మవారి ఆలయాలన్నీ పండుగకు ముస్తాబవుతున్నాయి. దసరా సందర్భంగా మార్కెట్లలో పూలు, పండ్లు, పూజా సామగ్రి ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రధానంగా పూల దుకాణాల వద్ద గురువారం ఉదయం నుంచే రద్దీ పెరిగింది. పూజా సామగ్రి కోసం వచ్చిన నగరవాసులతో బజారు వీధులు కళకళలాడుతున్నాయి. రాష్ట్రంలో నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు. 9వ రోజు ఆయుధ పూజ, 10వ రోజు విజయ దశమి పండుగను వైభవంగా నిర్వహించుకొనేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇళ్ల, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లో శుక్రవారం పూజలు జరుపుకోనున్నారు. కోయంబేడు, మైలాపూర్, పురుషవాక్కం, అడయార్, పెరంబూర్, ఎగ్మూర్, టి.నగర్, సైదాపేట తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచే అరటి, మామిడి తోరణాలు, పసుపు కొమ్ములు, అటుకులు, బొరుగులు, బెల్లం, పూలు తదితర పూజా సామగ్రి విక్రయాలు ఊపందుకున్నాయి. కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌లో బుధవారం రూ.130కి విక్రయించిన కిలో ఆపిల్ ధర ప్రస్తుతం రూ.180కి పెరిగింది. అలాగే ఇతర పండ్ల ధరలు కూడా పెరిగాయి. ఇక్కడి పూల మార్కెట్‌లో అధిక ధరలకు పూల విక్రయం జరిగింది. కిలో మల్లె రూ.1,000, జాస్ మల్లి రూ.1,100, ముల్లై రూ.500, చామంతి రూ.260, సంపంగి రూ.500, పన్నీర్‌రోజ్ రూ.180, చాక్లెట్ రోజ్ రూ.380కి విక్రయిస్తున్నారు.




షావుకారుపేటలో దుర్గాష్టమి పూజల్లో ఉత్సాహంగా పాల్గొన్న బెంగాళీలు - సంప్రదాయ నృత్యంతో భక్తుల సందడి

### కిక్కిరిసిన బస్సులు, రైళ్లు..

ఆయుధపూజ, విజయ దశమి, ఆదివారం వరుస సెలవులు రావడంతో నగరం నుంచి సొంతూళ్లకు వెళ్లే వారితో బస్సులు, రైళ్ల కిటకిటలాడాయి. అదే విధంగా నగరం నుంచి దూరప్రాంతాలకు నడుపుతున్న బస్సుల్లో మామూలు రోజుల కంటే పండుగ సందర్భంగా రద్దీ పెరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖల ఆధ్వర్యంలో 2,000 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. బుధవారం నగరం నుంచి అదనంగా 500 బస్సులు, గురువారం అదనంగా 2,000 బస్సులు నడిపారు.

### సమరయోధులు, తమిళ పండితులకు

# ఉచిత బస్ ప్రయాణం

### రవాణా మంత్రి శివశంకర్ ప్రకటన



చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వాతంత్ర్య సమరయోధులు, భాషోద్యమ కారులు, తమిళ పండితులు, వృద్ధాప్యంలో ఉన్న తమిళ మేధావులు, అవార్డు గ్రహీతలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్న రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. అరవైయేళ్లకు పైబడిన స్వాతంత్ర్య సమరయోధులు, భాషోద్యమంలో పాల్గొన్న వారు, తమిల భాష, తమిళ అభివృద్ధికోసం విశిష్టసేవలందించినవారికి ఈ యేడాది జూన్ ఒకటి నుంచి ఉచిత బస్ ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం సమరయోధులు ఉచితంగా ప్రయాణించేందుకు బస్ డ్రైవర్లు, కండెక్టర్లు సహకరించడం లేదనే ఆరోపణలపై స్పందించిన మంత్రి ఇకపై స్వాతంత్య సమరయోధులు, వృద్ధులను బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతించాలని డ్రైవర్, కండెక్టర్లకు ఆదేశాలిచ్చారు. అంతే కాకుండా సమరయోధులు, తమిళ మేధావులు, పండితులతోపాటు సహాయకులను కూడా ఉచితంగా ప్రయాణించేందుకు కండెక్టర్, డ్రైవర్లు అనుమతించాలని, ఈ ఆదేశాలను సక్రమంగా పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించారు.

### ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు

# స్టాలిన్ తీపి కబురు

**20 శాతం బోనస్ ● 2.75 లక్షల మందికి దీపావళి కానుక**

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు 2023-24 సంవత్సరానికిగాను 20 శాతం బోనస్ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. సవరించిన బోనస్ చట్టం 2015 ప్రకారం అత్యధిక వేతనం పొందటానికి అర్హత కలిగిన వేతన గరిష్ఠ పరిమితిని రూ.21,000లకు పెంచామని, ఆ మేరకు గరిష్ఠ వేతనాన్ని లెక్కగట్టి నెలసరి వేతన గరిష్ఠ వేతన పరిమితి రూ. 7వేలు ప్రకటిస్తున్నామన్నారు. ఆ మేరకు నెలసరి వేతనాల గరిష్ఠ పరిమితి రూ.21,000లుగా సడలించి, సీ, డీ కేటగిరీల ఉద్యోగులకు 2023-24 సంవత్సరానికిగాను బోనస్, ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వెలువరించిన ప్రకటన మేరకు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మికులు, సిబ్బంది పొందనున్న బోనస్ వివరాలు ఇలా ఉన్నాయి.

1. లాభసాటి ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే 'సీ', 'డీ' కేటగిరి కార్మికులు, సిబ్బందికి 8.33 శాతం బోనస్ 11.67 శాతం ఎక్స్‌గ్రేషియా చొప్పున మొత్తం 20 శాతం బోనస్ చెల్లిస్తారు.
2. రాష్ట్ర విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థలు, ప్రభుత్వ రవాణా సంస్థలు, ప్రభుత్వ వినియోగదారుల వాణిజ్య సంస్థలు, రాష్ట్ర పాల ఉత్పత్తి దారుల సహకార సంస్థల్లో పనిచేసే అర్హత కలిగిన 'సీ', 'డీ' కేటగిరీ కార్మికులు, సిబ్బందికి కూడా 8.33 శాతం బోనస్, 11.67 శాతం ఎక్స్‌గ్రేషియా మొత్తం 20 శాతం బోనస్ చెల్లించనున్నారు.
3. లాభాలతో నిమిత్తం లేకుండా పనిచేసే ప్రభుత్వ రంగ సంస్థల్లో 'సీ', 'డీ' కేటగిరి కార్మికులు, సిబ్బంది 8.33 శాతం బోనస్, 1.67 శాతం ఎక్స్‌గ్రేషియా అంటూ మొత్తం 10 శాతం బోనస్ అందుకోనున్నారు.
4. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ, చెన్నై తాగునీటి సరఫరా సంస్థ, మురుగునీటి తొలగింపు సంస్థ కార్మికులు, సిబ్బందికి కూడా 8.33 శాతం బోనస్, 1.67 శాతం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు.
5. రాష్ట్ర నీటిసరఫరా సంస్థలో పనిచేసే 'సీ', 'డీ' కేటగిరీ కార్మికులు 8.33 శాతం బోనస్ మాత్రమే చెల్లిస్తారు.
6. ఇవికాకుండా రాష్ట్ర వినియోగదారుల వాణిజ్య సంస్థలో కాంట్రాక్టు కార్మికులు రూ.3000లు ఎక్స్‌గ్రేషియా అందుకోనున్నారు.

అర్హత కలిగిన కార్మికులు, సిబ్బంది ఈ యేడాది కనీసపక్షంగా రూ.8400లు, అధికపక్షంగా రూ.16800లను బోనస్‌గా అందుకోనున్నారు. ఈ బోనస్‌ను 2 లక్షలా 75 వేలా 670 మంది కార్మికులు, సిబ్బంది లబ్ధి పొందనున్నారు. వీరికి రూ.369 కోట్లా 65 లక్షలను బోనస్‌గా ఎక్స్‌గ్రేషియా రూపంలో చెల్లించనున్నారు.

అడయార్‌జోన్‌లో ప్రసంగిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం




# ఆరు రోజులు భారీ వర్షాలు

**నగరంలో అర్ధరాత్రి కురిసిన వాన**

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలో శుక్రవారం నుంచి భారీ స్థాయిలో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, నగరంలో, సబర్బన్ ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు, తిరువణ్ణామలై, విల్లుపురం,కడలూరు, మైలాడుదుర్తై, తంజావూరు, తిరువారూరు, నాగపటిట్నం జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. కన్నియాకుమారి కడలిలోను, అరేబియా సముద్రతీరం, శ్రీలంక, దాని చుట్టూ ఉన్న ప్రాంతాల్లోనూ ఉపరితల ఆవర్తనం ఏర్పడడం, వీటికి తోడు కచ్చాదీవి, దాని చుట్టూ అరేబియా సముద్ర ప్రాంతం వద్ద అల్పపీడనం కారణంగా మరో ఆరు రోజులపాటు సేలం, కృష్ణగిరి, ధర్మపురి, తిరుపత్తూరు, నామక్కల్, కరూరు, తిరుచ్చి, మదురై, విరుదునగర్, దిండుగల్, తేని, రామనాథపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. సముద్రతీరాల్లో గంటకు 35 నుంచి 45 కి.మీ. వేగంతో పెనుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు.

**వరద ప్రాంతాల వివరాలివ్వండి..**

ఇదిలా ఉండగా ఈశాన్యా రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా వరద పరిస్థితుల ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం కార్పొరేషన్ జోన్ల వారీగా స్థానికులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిస్తే ఎక్కువగా వరదలు సంభవించే ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు.

# 'మురసొలి' సెల్వం కన్నుమూత

● స్టాలిన్ సహా నేతల సంతాపం



సెల్వం (ఫైల్‌ఫొటో)

చెన్నై గోపాలపురం నివాసగృహంలో మురసొలి సెల్వం భౌతికకాయం వద్ద బోరున విలపిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పార్టీ పత్రిక 'మురసొలి' గౌరవ సంపాదకుడు, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి అల్లుడు మురసొలి సెల్వం (84) గురువారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన వృద్ధాప్య సమస్యలతోపాటు అనారోగ్యానికి గురయ్యారు. ఇటీవల ఆయన బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందారు. గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటు రావటంతో ఆయన మృతి చెందారు. గత ఐదు దశాబ్దాలుగా 'మురసొలి' పత్రిక గౌరవ సంపాదకుడిగా పనిచేస్తున్నారు. 'సిలంది' అనే కలంపేరుతో రాజకీయ వ్యాసాలను రాశారు. సెల్వం భౌతిక కాయాన్ని డీఎంకే ప్రముఖులు, నేతలు, కార్యకర్తలు సందర్శించేందుకు వీలుగా గోపాలపురంలోని కరుణానిధి నివాసంలో ఉంచారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఎంపీ దయానిధి మారన్ తదితరులు సెల్వం భౌతికకాయానికి నివాళులర్పించారు. సెల్వం కేంద్ర మాజీ మంత్రి దివంగత మురసొలి మారన్ సోదరుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరి సెల్వి భర్త. స్టాలిన్ రాజకీయ ప్రవేశానికి మురసొలి సెల్వమే కారణం. డీఎంకే యువజన విభాగాన్ని స్టాలిన్ స్థాపించినప్పుడు సెల్వం ఆయనకు రాజకీయ సలహాదారుడిగా పనిచేశారు.

**సీఎం స్టాలిన్ సంతాపం..**

దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి కుడిభుజంగా వ్యవహరించి పార్టీ పత్రిక మురసొలిని ఐదు దశాబ్దాలకు పైగా సమర్థవంతంగా నడిపిన తన బావగారైన మురుసొలి సెల్వం మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన సంతాప సందేశంలో తన తండ్రి కరుణానిధి మృతి తర్వాత కష్ట కాలంలో ఓదార్పునిచ్చిన సెల్వం మృతి చెందారని పిడుగు లాంటి వార్త విని క్రుంగిపోయానని తెలిపారు. పార్టీ పత్రిక నడపటంతో తమిళ సినీ రంగానికి కూడా విశిష్ట సేవలందించారని గుర్తు చేశారు. తన చిన్న వయస్సులోనే అన్నగా తనను నడిపించిన వ్యక్తి ఆయనేనని స్టాలిన్ పేర్కొన్నారు. మురసొలి సెల్వం తాను చిన్ననాటి స్నేహితులమని, కలిసి చదువుకున్నామని సీనియర్ మంత్రి దురైమురుగన్ సంతాప సందేశంలో తెలిపారు. సెల్వం మృతి తనకు. పార్టీకి తీరని లోటన్నారు. సెల్వం మృతికి పార్టీ మూడు రోజులపాటు సంతాపం పాటిస్తుందని, పార్టీ జెండాలు సగం వరకూ ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు దురైమురుగన్ విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, సీఎంపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కే బాలకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, ద్రావిడ కళగం నేత కే వీరమణి తదితరులు సంతాపం ప్రకటించారు.



గోపాలపురం నివాసంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పరామర్శిస్తున్న మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం, వైగో



సూర్యప్రభ వాహనంపై ఉలగలంద పెరుమాళ్ భంగిమలో శ్రీవేంకటేశ్వరస్వామి




చెన్నై, టి.నగర్ టీటీడీ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం చంద్రప్రభ వాహనంలో కొలువుదీరిన శ్రీవారు. స్వామి సేవలో టీటీడీ చెన్నై సమాచారకేంద్ర సలహామండలి మాజీ సభ్యులు మోహన్‌రావు తదితరులు

## సమాచార దర్శిని

### 14 నుంచి గ్రూప్-2, 2ఏ శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 10: గ్రూప్-2, గ్రూప్-2ఏ మెయిన్స్ శిక్షణ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం నుంచి శుక్ర వారం వరకు ఈ శిక్షణా తరగతులు జరుగనున్నాయి. ఈ శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు, తాము రాసిన గ్రూప్-2, గ్రూప్-2ఏ హాల్ టిక్కెట్, ఆధార్ కార్డు నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో గిండి లోని జిల్లా ఉద్యోగావకాశాలు, శిక్షణ సంస్థ కార్యాలయాన్ని (పనిదినాల్లో) సంప్రదించాలి. మరిన్ని వివరాలకు decgc-coachingclass@gmail.-com అనే ఈ-మెయిల్ ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

### వైద్యకళాశాలల్లో 1,097 సీట్లు ఖాళీ

పెరంబూర్, అక్టోబరు 10: ప్రభుత్వ, స్వయంప్రతిపత్తి వైద్యకళాశాలల్లో 1,097 ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొదటి సంవత్సరం వైద్య కోర్సుల్లో రెండు విడతల అడ్మిషన్ కౌన్సెలింగ్ ముగిసింది. ప్రస్తుతం, ప్రభుత్వ కళాశాలల్లో 33 సీట్లు, స్వయంప్రతిపత్తి కళాశాలల్లో 498 మొత్తం 531 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. అలాగే, బీడీఎస్ కోర్సులో ప్రభుత్వ కళాశాలల్లో 62 సహా 566 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఒకవేళ సీటు పొంది తిరిగి అప్పగించాలనుకొనే విద్యార్థులు ఈ నెల 13వ తేదిలోగా తెలియజేయాలని, ఈ సీట్లు భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. కాగా, ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ఈ నెల 14, బీడీఎస్ తరగతులు ఈ నెల 16వ తేది నుంచి ప్రారంభం కాన్నుయని వైద్యకోర్సుల అడ్మిషన్ కమిషన్ తెలిపింది.

### పది జిల్లాల్లో 'సహకార సంతలు'

పెరంబూర్, అక్టోబరు 10: సహకార శాఖ ఆధ్వర్యంలో 'సంతలు' ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో రైతు బజార్లు నిర్వహిస్తున్నారు. కాగా, సహకార శాఖ ఆధ్వర్యంలో సహకార బ్యాంక్‌లున్నాయి. ఈ క్రమంలో, రైతుల నుంచి కూరగూరలు, పండ్లు కొనుగోలు చేసే సంతలు ఏర్పాటుచేయాలని సహకార శాఖ నిర్ణయించింది. తొలివిడతగా పది జిల్లాల్లో సంతలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం సేలం జిల్లా పెద్దనాయకన్‌పాళయంలో రూ.20 లక్షలతో 10-20 దుకాణాలతో 24 గంటలు పనిచేసేలా సహకార సంత ఏర్పాటుకానుందని అధికారులు తెలిపారు.

### నదులు, జలాశయాల నిరంతర పర్యవేక్షణ

పెరంబూర్, అక్టోబరు 10: ఈశాన్య రుతుపవనాల ముందస్తు చర్యల్లో భాగంగా నదులు, జలాశయాలను 24 గంటలు పర్యవేక్షించనున్నారు. ఈ ఏడాది ఈశాన్య రుతువపనాలతో 112 శాతం వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. రుతుపవనాలను ఎదుర్కొనేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. చెన్నై, కోయంబత్తూర్, మదురై, తిరుచ్చి తదితర మండలాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా అన్ని నదులు, జలాశయాల్లో నీటి పరిమాణాలను 24 గంటలు పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రెండు షిఫ్టులలో ఇంజనీరు, సిబ్బందితో కూడిన బృందాలు పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

### 19కి వాటర్ బోర్డు గ్రీవెన్స్ వాయిదా

పెరంబూర్, అక్టోబరు 10: చెన్నై మెట్రోవాటర్ బోర్డు పరిధిలోని 15 మండల కార్యాలయాల్లో ప్రతి నెలా మొదటి శనివారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ శిబిరాలు ఈ నెల 12వ తేది జరగాల్సి ఉండగా, ఆ రోజు సెలవు కావడంతో, శిబిరాల తేదీ వాయిదావేశారు. ఆ ప్రకారం, 19వ తేది ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగనున్న ఈ శిబిరాల్లో ప్రజలు పాల్గొని తాగునీరు, మురుగునీటి సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందాలని అధికారులు తెలిపారు.

### రేపటి టైం టేబుల్‌తో నేడు మెట్రోరైళ్లు

పెరంబూర్, అక్టోబరు 10: మెట్రోరైళ్లు శనివారం టైంటేబుల్ ప్రకారం శుక్రవారం నడువనున్నాయి. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) విడుదల చేసిన ప్రకటనలో... విజయదశమి సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ సెలవు కావడంతో ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 6 నిమిషాల వ్యవధిలో మెట్రోరైళ్లు నడువనున్నాయి. అలాగే, తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 8 గంటలు, 11 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 7 నిమిషాలు, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిమిషాల వ్యవధిలో మెట్రోరైళ్లు నడుస్తాయని సీఎంఆర్ఎల్ తెలిపింది. అలాగే, శుక్రవారం రోజున ఆదివారం టైంటేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

### రోగుల అటెండర్లకు 'ట్యాగ్'లు

పెరంబూర్, అక్టోబరు 10: స్థానిక రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో ప్రతిరోజు సుమారు 18,000 మంది ఔట్ పేషంట్లు, ఇన్‌పేషంట్లు చికిత్స పొందుతున్నారు. ఇన్‌పేషంట్లకు తోడుగా ఒక అటెండర్‌ను అనుమతిస్తుంటారు. కానీ, ఒక రోగికి ఒకరుకు బదులుగా ముగ్గురు, నలుగురు ఉంటున్నట్లు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన ఆస్పత్రి డీన్ తేరణి రాజన్, ఆస్పత్రిలో రద్దీ నియంత్రణకు ట్యాగ్ విధానాన్ని బుధవారం ప్రారంభించారు. ఆ ప్రకారం, ఒక రోగికి ఇద్దరు అటెండర్ల చేతికి ట్యాగ్‌లు ఏర్పాటుచేయనున్నారు. సాధారణ వార్డుల్లో ఉండే అటెండర్లకు 'నీలం' రంగు, ఐసీయూ ఉన్న రోగుల సహాయకులకు 'పసుపు' రంగు ట్యాగ్ వేయనున్నటు, ఈ ట్యాగ్‌లున్న వారు మాత్రమే రోగుల గదిలో ఉండేందుకు అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

### విమాన టిక్కెట్ ధరలకు రెక్కలు

పెరంబూర్, అక్టోబరు 10: నగరం నుంచి మదురై, తిరుచ్చి, కోవై, సేలం, తూత్తుకుడి తదితర నగరాలకు వెళ్లే విమాన ధరలు పలు రెట్లు పెరిగాయి. రాష్ట్రంలో ప్రస్తుతం నవరాత్రి, ఆయుధపూజ, విజయ దశమి తదితర వరుస సెలవులు రావడంతో నగరంలో స్వదేశీ విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంది. దీంతో, స్వదేశీ విమానాల టిక్కెట్ల ధరలు పెంచేశారు. వరుస సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువ కావడంతో టిక్కెట్లు ధరలు పెంచేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

- చెన్నై-మదురై విమాన టిక్కెట్టు ధర రూ.4,200 కాగా ప్రస్తుతం రూ.12,026 నుంచి రూ.19,626గా నిర్ణయించారు.
- చెన్నై-తూత్తుకుడి ధర రూ.5,006 కాగా ప్రస్తుతం రూ.11,736 నుంచి రూ.13,626 వసూలుచేస్తున్నారు.
- చెన్నై-కోవై చార్జి రూ.3,290 కాగా ప్రస్తుతం రూ.10,996 కు పెరిగింది.
- చెన్నై-సేలం విమాన టిక్కెట్టు ధర రూ.3,317 కాగా ప్రస్తుతం రూ.10,792కు చేరింది.

# వేణుగోపాల విద్యాలయ సేవలు ప్రశంసనీయం

**డాక్టర్ జేఎస్ రాజ్‌కుమార్ ● విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ**




ఉపకార వేతనాలు, ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ జేఎస్ రాజ్‌కుమార్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌రెడ్డి తదితరులు

ప్యారీస్, అక్టోబరు 10: నాలుగు దశాబ్దాలుగా నాణ్యమైన విద్య అందిస్తున్న వేణుగోపాల్ విద్యాలయ సేవలు ప్రశంసనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్‌జేఎస్ రాజ్‌కుమార్ కొనియాడారు. ఈ మేరకు తెలుగు మహాజన సంఘం నిర్వహణలోని వేణుగోపాల విద్యాలయ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలు 44వ వార్షికోత్సవం గురువారం రాత్రి తేనాంపేటలోని కామరాజర్ ఆరంగంలో ఘనంగా జరిగింది. సభాధ్యక్షులుగా పాఠశాల ప్రెసిడెంట్, ప్రముఖ పారిశ్రామికవేత్త కె.అనీల్‌కుమార్ రెడ్డి వ్యవహరించి, విద్యాలయం అందిస్తున్న సేవలను వివరించారు. తెలుగు మహాజన సమాజం నిర్వహణలో కొనసాగుతున్న ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతి ఏటా పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించి పాఠశాలకు ఘనత చేకూరుస్తున్నారని తెలిపారు. మాజీ రాష్ట్రపతి డా.అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వార్షిక నివేదికను పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ వి.గోవింగ్ వినిపించారు. ముఖ్యఅతిథిగా లైఫ్ లైన్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డా.జేఎస్ రాజ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. అలాగే, ఉత్తమ మార్కులు సాధించిన టెన్త్, ప్లస్ టూ విద్యార్థులకు అనీల్‌కుమార్ ప్రత్యేకంగా వాచీలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేణుగోపాల విద్యాలయం అందిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శీల వెంకటకృష్ణన్, వైస్ ప్రెసిడెంట్ కె.ఆనంద కుమార్ రెడ్డి, కోశాధికారి కె.రంగారావు, తెలుగు ప్రముఖులు అజంతా శంకరరావు, జేఎం నాయుడు, గుడిమెట్ల చెన్నయ్య, మోహనరావు, గొల్లపల్లి ఇశ్రాయేలు, డా.ఏవీ శివకుమారి, శ్రీలక్ష్మీ మోహనరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముందుగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ మంత్రి ఆకస్మిక తనిఖీ

**● పాఠాలు చెప్పిన అన్బిల్ మహేష్**

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి శుక్రవారం ఉదయం ధర్మపురి జిల్లా పాలక్కోడు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ తర్వాత పీఎంకే శాసనసభ్యుడు జీకే మణితో కలిసి పొన్నగరం నియోజకవర్గం పరిధిలోని పాఠశాలలో కూడా తనిఖీ జరిపారు. విద్యార్థులతో మాట్లాడడమే కాకుండా కొంతసేపు లెక్కల పాఠాలు కూడా బోధించారు. చివరగా ఆ పాఠశాలలో అమలు చేస్తున్న అల్పాహారం పథకం అమలు గురించి అడిగి తెలుసుకున్నారు.



పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి

## గ్రామాల్లో మౌలికవసతులు కల్పించాలి



అంబేడ్కర్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 10: గ్రామాల్లో మౌలికవసతులు కల్పించేలా ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి సూచించారు. కేవీ కుప్పం పంచాయతిలో గురువారం కౌన్సిలర్లు, సభ్యుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీ కదిర్ ఆనంద్ పాల్గొన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, వరద నివారణ చర్యలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో జిల్లా పంచాయతి అభివృద్ధి అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ, పంచాయతీ ఈఈ శ్రీనివాసన్, కేవీ కుప్పం పంచాయతి అధ్యక్షుడు రవిచంద్రన్, కౌన్సిలర్లు సీతారామన్, మురుగేశన్ తదితరులు పాల్గొన్నారు.


**కార్పొరేషన్‌లో కలెక్టర్ తనిఖీలు..**

కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న పనులను కలెక్టర్ సుబ్బులక్ష్మి గురువారం పరిశీలించారు. 4వ మండలం వసంతాపురంలో నికిల్‌సన్ కాలువ పరిశీలించిన కలెక్టర్, కాలువల్లో చెత్తాచెదారాలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 42వ వార్డు ఆర్ఎన్ పాళ్యం, 16 వార్డు అంబేడ్కర్ వీధిలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట కార్పొరేషన్ మేయర్ సుజాత, ఉప కమిషనర్ సౌందర్‌రాజన్, ఇంజనీర్ పార్వతి, వైద్యశాఖ అధికారి దినేష్, తహసీల్దార్ మురళీధరన్, కమిషనర్ జానకి తదితరులున్నారు.

### టీవీకే మహానాడు ప్రాంగణాన్ని పరిశీలించిన ఐజీ

ప్యారీస్, అక్టోబరు 10: విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వి.శాలైలో ఈ నెల 27న నిర్వహించనున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడు వేదిక ప్రాంగణాన్ని విల్లుపురం ఐజీ, అధికారులతో కలసి పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం ఐజీ అశ్రా ఖార్గ్, టీవీకే పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ వద్ద మహానాడులో పాల్గొనే కార్యకర్తలకు ఎలాంటి వసతులు కల్పించారని అడిగి తెలుసుకున్నారు. వీఐపీల భద్రత, కార్యకర్తల కోసం ఏర్పాటుచేయనున్న సీటింగ్, ఆహారం, తాగునీరు తదితర వసతులు ఏర్పరచనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఐజీతో పాటు డీఐజీ నిషామిట్టల్, ఎస్పీ దీపక్ శివాజ్ తదితర పోలీసు అధికారులున్నారు.

### అలరించిన బెంగళూరు చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



భరతనాట్యం చేస్తున్న దేష్నా, గాత్రకచేరీ చేస్తున్న సహానా

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్యారీస్ కార్నర్ తంబుశెట్టి వీధిలోని కాళికాంబాళ్ కమటేశ్వర ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బెంగళూరుకు చెందిన ఇద్దరు చిన్నారులు నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన, కర్ణాటక గాత్ర కచేరీ భక్తులను అలరింపజేశాయి. బెంగళూరుకు చెందిన లావణ్య రూపకుల శిష్యురాలైన సహానా (13) తన గాత్ర మాధుర్యంతో శ్రోతలను మైమరపించింది. ఇదే రీతిలో ప్రీతా అరుణ్ శిష్యురాలైన దేష్నా (11) ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన ప్రేక్షకులను అలరింపజేసింది. తమ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్న ఈ చిన్నారులను ఆలయ నిర్వాహకులు, నగర ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాళికాంబాళ్ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ ఈఎం మోహనాచ్చారి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### మహిళలు పనిచేసే చోట 'స్థానిక ఫిర్యాదుల కమిటీలు'

పెరంబూర్, అక్టోబరు 10: నగరంలో 10 మందికి పైగా మహిళలు పనిచేస్తున్న సంస్థల్లో స్థానిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వేతర సంస్థలు, వ్యాపార సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఐటీ కంపెనీల్లో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేలా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా పది మందికి పైగా మహిళలు పనిచేసే సంస్థల్లో ఐదుగురు సభ్యులతో స్థానిక ఫిర్యాదుల కమిటీ ఏర్పాటుచేయాలని, ఆ కమిటీల్లో 3 మహిళలు తప్పకుండా ఉండాలన్నారు. అందుకోసం ఆయా సంస్థల కార్యాలయాల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటుచేయాలని, కమిటీ వాటిని పరిశీలించి విచారణ చేపట్టి తగిన చర్యలు చేపడుతుందన్నారు. సంస్థల్లో తమకు జరిగే వేధింపులపై www.shebox.nic.in అనే వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

### 14 నుంచి బీఎడ్ కోర్సుల కౌన్సెలింగ్

పెరంబూర్, అక్టోబరు 10: ప్రస్తుత విద్యా సంవత్సరం బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 14వ తేది నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో 7 ప్రభుత్వ బీఎడ్ కళాశాలల్లో 900 సీట్లు, 14 ఎయిడెడ్ కళాశాలల్లో 1,140 మొత్తం 2,040 సీట్లున్నాయి. వాటికి దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించగా, 3,486 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,187 మంది మాత్రమే రుసుము చెల్లించారు. ఈ క్రమంలో, గత నెల 30వ తేది ర్యాంకుల జాబితా విడుదలైంది. ట్రిప్లికేన్‌లోని లేడి వెల్లింగ్టన్ కళాశాలలో ఈ నెల 14 నుంచి 19వ తేది వరకు కౌన్సెలింగ్ జరుగనుందని, ఏ తేదీన ఏ విభాగానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు అనే వివరాలను అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా పంపినట్లు అధికారులు తెలిపారు.

## వెల్లలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

**● రిజిస్ట్రార్ కారులో రూ.13 లక్షల స్వాధీనం**

పెరంబూర్, అక్టోబరు 10: కోయంబత్తూర్ జిల్లా వెల్లలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. అందులో లెక్కల్లో చూపని రూ.13.35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కోవై సిద్ధాపుదూర్ ప్రాంతానికి చెందిన కరుప్పస్వామి రిజిస్ట్రేషన్ చేసేందుకు రాగా, కార్యాలయ అధికారులు రూ.35 వేలు లంచం అడిగారు. దీంతో, కరుప్పస్వామి ఏసీబీ అధికారులను ఫిర్యాదు చేశారు. వారి సూచనలతో రసాయనం పూసిన నోట్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భూపతి రాజాకు అందిస్తున్న సమయంలో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు జూనియర్ అసిస్టెంట్ సహా సబ్ రిజిస్ట్రార్ న్యాన్సీనిత్య కరోలినాను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కారులో లెక్కల్లో లేని రూ.13.35 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన అధికారులు, ఇరువురితో పాటు కార్యాలయ ఉద్యోగులను విచారిస్తున్నారు.

## జూలై 13న గ్రూప్-4 పరీక్ష

**● వార్షిక టైంటేబుల్ విడుదల చేసిన టీఎన్‌పీఎస్సీ**

పెరంబూర్, అక్టోబరు 10: గ్రూప్-4 పరీక్ష నోటిఫికేషన్ వచ్చే ఏడాది ఏప్రిల్ 25వ తేది విడుదల కానుంది. 2025వ సంవత్సరానికి సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను టీఎన్‌పీఎస్సీ గురువారం తెలియజేసింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను టీఎన్‌పీఎస్సీ, ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నిర్వహిస్తుంటారు. ఆయా విభాగాల్లో ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి వచ్చే ఏడాది పరీక్షల షెడ్యూల్‌ను టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఆ ప్రకారం, గ్రూప్-1 పరీక్షకు సంబంధించి ఏప్రిల్ 1వ తేది నోటిఫికేషన్ విడుదల కానుండగా, జూన్ 15వ తేది పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. గ్రూప్-4 పరీక్షల నోటిఫికేషన్ ఏప్రిల్ 25వ విడుదల కానుండగా, జూలై 13న పరీక్ష నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది (2025) నిర్వహించనున్న పరీక్షల వివరాలు http://tnpsc.govl.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

### స్నేహితుడిని కలిసేందుకే ఢిల్లీ వెళ్ళా!

**● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై**

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పారిశ్రామిక దళంలో పనిచేస్తున్న తన స్నేహితుడిని కలిసేందుకే తాను ఢిల్లీ వెళ్ళానని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ప్రకటించారు. బుధవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఆయన ఢిల్లీ వెళ్ళారు. పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకే ఆయన హస్తినకు వెళ్ళారని వార్తలు వినిపించాయి. ఈ విషయమై సెల్వపెరుందగైని ప్రశ్నించగా తేని ప్రాంతానికి చెందిన తన స్నేహితుడు సుకుమార్ కేంద్ర పారిశ్రామిక భద్రతాదళంలో సైనికుడిగా పనిచేస్తున్నాడని, కైలాష్ ప్రాంతంలో జరిగిన బాంబు పేలుడులో అతడి కాలికి బలమైన గాయాలయ్యాయని, ప్రస్తుతం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సుకుమార్‌ను పరామర్శించేందుకే ఢిల్లీ వెళ్ళానని చెప్పారు.



వేలూరు జిల్లా మేట్టూరు గ్రామంలో జిల్లా సమాచార ప్రసార శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలతో కూడిన ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ప్రజలు

### శ్రీవారిసేవలో కేతిరెడ్డి



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, నిర్మాత, దర్శకుడు, తమిళనాడు యువ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి గురువారం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

## నాగై జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగల దాడి



శ్రీలంక సముద్రపు దొంగల దాడిలో గాయపడి తిరిగొచ్చిన జాలర్లు

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కోడియక్కరైకి 15 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంలో చేపలుపడుతున్న నాగపట్టినంకు చెందిన నలుగురు జాలర్లపై శ్రీలంక సముద్రపు దొంగలు దాడి చేసి వలలు, సెల్‌ఫోన్లు, జీపీఎస్ పరికరాలు, డీజిల్ తదితర వస్తువులను దోచుకెళ్ళారు. నాగపట్టినం సెరుదూరు గ్రామం నుంచి సత్యసీలన్ అనే వ్యక్తికి చెందిన ఫైబర్ పడవలో అదే ప్రాంతానికి చెందిన విజయన్, రమణన్, విఘ్నేష్‌కుమార్, రీగన్ అనే నలుగురు జాలర్ల ఈ నెల 10న సముద్రంలో చేపలవేటకు వెళ్ళారు. బుధవారం రాత్రి వీరంతా కోడియక్కరై నుంచి ఆగ్నేయంగా 15 నాటికల్ మైళ్ల దూరంలో చేపలుపడుతుండగా రెండు ఫైబర్ పడవల్లో వచ్చిన ఆరుగురు సముద్రపు దొంగలు దాడికి దిగారు. పడవలో ఉన్న వలలు, సెల్‌ఫోన్‌లు, జీపీఎస్ పరికరాలు, 100 లీటర్ల డీజిల్, రేషన్ సరకులు దోచుకుని మాయమయ్యారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ నలుగురు జాలర్లు కోడియక్కరై తీరానికి చేరుకున్నారు. సముద్రపు దొంగల దాడి గురించి వేదారణ్యం సముద్రతీర భద్రతా దళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత నలుగురు జాలర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స అందుకుంటున్నారు.

## మత్తుమందిచ్చి మహిళపై అఘాయిత్యం

అడయార్, అక్టోబరు 10: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ మహిళకు పండ్లరసంలో మత్తుమందు కలిపి అత్యాచారం చేయడమేకాకుండా, ఆమె వేసుకున్న బంగారు గొలుసు చోరీ చేసిన వ్యక్తి కోసం నగర పోలీసులు గాలిస్తున్నారు. స్థానిక కొళత్తూరుకు చెందిన మహిళ (30)కు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మనస్పర్థల కారణంగా భర్తను వదిలి తన పిల్లలతో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్‌లో జయకుమార్ అనే వ్యక్తితో పరిచయం కాగా, ఆయనకు తన కథ చెప్పింది. దీంతో తాను పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీ రెట్టేరి జంక్షన్ వద్దకు ఆమెను పిలిపించాడు. అక్కడ పండ్ల రసంలో మత్తుమందు కలిపి ఇచ్చి, పక్కనే ఉన్న లాడ్జికి తీసుకెళ్ళి అత్యాచారం చేయడమేకాకుండా, ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీ చేశాడు. ఆ తర్వాత ఆ మహిళను ఆటోలో ఎక్కించి ఇంటికి పంపించాడు. అప్పటికిగాని ఆమెకు అసలు విషయం తెలియరాలేదు. తనపై అఘాయిత్యం చేయడంతో పాటు బంగారు చైన్‌ను కూడా చోరీ చేసినట్టు గుర్తించి జయకుమార్‌కు ఫోన్ చేయగా, స్విచాఫ్ అని వచ్చింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజామంగళం పోలీస్ ఇన్‌స్పెక్టర్ మూర్తి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

### కాల్ టాక్సీ డ్రైవర్‌కు నకిలీ నోట్లిచ్చిన వ్యక్తి కోసం గాలింపు

పెరంబూర్, అక్టోబరు 10: స్థానిక వడపళనిలో కాల్ టాక్సీ డ్రైవర్‌కు నకిలీ నోట్లు ఇచ్చిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వడపళని నుంచి మహాబలిపురం వెళ్లేందుకు ఓ వ్యక్తి కాల్ టాక్సీ బుక్ చేశాడు. గోవిందరాజ్ నడుపుతున్న కారు కొద్ది దూరం వెళ్లిన తర్వాత, త వ్యక్తి టీ కోసం కారు ఆపాలని కోరాడు. గోవిందరాజ్ కారు రోడ్డు పక్కన నిలుపగా, తన వద్ద 7,000 ఉన్నాయని, తనకు జీపే ద్వారా పంపితే తాను డబ్బులు ఇస్తానని చెప్పాడు. దీంతో గోవిందరాజ్ అతను చెప్పిన నెంబరుకు రూ.7,000 పంపించగా, అతను నగదు ఇచ్చాడు. కొద్దిసేపటి తర్వాత దుకాణంలో టీ తాగుతున్న వ్యక్తి హఠాత్తుగా అదృశ్యమయ్యాడు. దీంతో అతడు ఇచ్చిన నోట్లు నకిలీవిగా గుర్తించిన గోవిందరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి ఆ వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

## మలేసియా విమానంలో సాంకేతికలోపం

**● ప్రయాణికులకు తప్పిన ముప్పు**

అడయార్, అక్టోబరు 10: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మలేసియాకు వెళ్ళాల్సిన విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన ఇంజనీర్లు విమానాన్ని నిలిపివేశారు. దీంతో ఆ విమానంలో వెళ్ళాల్సిన 168 మంది ప్రయాణికులతో పాటు విమాన సిబ్బంది మొత్తం 180 మంది ఎయిర్‌పోర్టులోనే ఉండిపోయారు. ఇంజనీర్లు సాంకేతిక లోపాన్ని సరిచేసిన తర్వాత విమానం మలేసియాకు వెళ్ళింది. బుధవారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరాల్సి ఉండగా, చివరి నిమిషంలో విమానంలో సాకేంతిక లోపాన్ని గుర్తించి నిలిపవేశారు. దీంతో అందులో వెళ్ళాల్సిన ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

### రూ.8 కోట్ల మోసం... అన్నాడీఎంకే నేత అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 10: విల్లుపురం మున్సిపల్ ఉద్యోగులకు చెందాల్సిన ప్రావిడెంట్ ఫండ్ సొమ్ము రూ.8 కోట్లు స్వాహా చేసిన అన్నాడీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు వినీత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్న వినీత్ ఉద్యోగుల వేతనం నుంచి జమ చేసుకుంటున్న పీఎఫ్ నగదును గత మూడు నెలలుగా జమ చేయకుండా మోసం చేసిన విషయం ఇటీవల వెలుగుచూసింది. దీంతో మున్సిపల్ అధికారుల ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పోలీసులు, వినీత్‌ను అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో, అవినీతి కేసులో పట్టుబడిన వినీత్‌ను పార్టీ సభ్యత్వం నుంచి తొలగిస్తూ అన్నాడీఎంకే అధిష్ఠానం చర్యలు చేపట్టింది.

### పెనుగాలికి పగిలిన బస్సు అద్దాలు

**● ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన డ్రైవర్**

అడయార్, అక్టోబరు 10: పెనుగాలులకు బస్సు అద్దాలు పగిలిపోవడంతో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను రక్షించాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కోయంబత్తూరు జిల్లా తొండాముత్తూరుకు చెందిన సురేంద్రన్ (32) అనే బస్సు డ్రైవరు. ఈ నెల 1వ తేదీన 60 మంది ప్రయాణికులతో తిరుప్పూరు నుంచి కోవైకు బయలుదేరాడు. ఈ క్రమంలో అవినాశి బైపాస్‌లో బలమైన పెనుగాలులు వీశాయి. దీంతో బస్సు అద్దాలు పగిలి పోవడంతో సురేంద్రన్ గాయపడ్డాడు. అయినప్పటికీ ప్రయాణికులను రక్షించేందుకు ధైర్యం చేసి, బస్సు నియంత్రణ కోల్పోకుండా రోడ్డుపక్కన నిలిపేశాడు. తమ ప్రాణాలను కాపాడిన డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

### ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు

ప్యారీస్, అక్టోబరు 10: స్థానిక గోపాలపురంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు వచ్చిన బాంబు బెదిరింపు వ్యవహారంలో పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం వెపేరి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి, గోపాలపురం డీఏవీ బాలుర మహోన్నత పాఠశాలలో బాంబు ఉంచినట్లు చెప్పి ఫోన్ కనెక్షన్ కట్ చేశాడు. దీంతో బాంబ్ స్క్వాడ్ పోలీసు జాగిలాలతో ఆ పాఠశాలకు వెళ్లి సుమారు 2 గంటలు చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థం లభ్యం కాలేదు. దీంతో, ఈ బెదిరింపు వదంతి అని పోలీసులు తెలిపారు.

### హత్య కేసులో కళాశాల నుంచి విద్యార్థుల తొలగింపు

పెరంబూర్, అక్టోబరు 10: స్థానిక రాజధాని కళాశాల విద్యార్థి సుందర్ హత్య కేసులో అరెస్టయిన పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు ఐదుగురిని కళాశాల నుంచి తొలగించారు. ఈ వ్యవహారంలో పోలీసుల నివేదిక ఆధారంగా విద్యార్థులు చంద్రు, యువరాజ్, ఈశ్వర్ హరిప్రసాద్, కమలేశ్వరన్ తదితరులను కళాశాల నుంచి డిస్మిస్ చేసినట్లు కళాశాల యాజమాన్యం ప్రకటించింది. కాగా, సుందర్ హత్యకేసులో ఈ ఐదుగురిని అరెస్ట్ చేసిన పెరియమేడు పోలీసులు వారిని జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

### బాణసంచా ప్రమాదాల్లో ఈ ఏడాది 52 మంది మృతి

పెరంబూర్, అక్టోబరు 10: రాష్ట్రంలో ఈ ఏడాది సంభవించిన బాణాసంచా పేలుళ్లలో 52 మంది మృతిచెందారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ సేఫ్టీ ఇన్‌ఫర్మేషన్ డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ... ఈ ఏడాది విరుదునగర్ జిల్లాలో జరిగిన బాణాసంచా ప్రమాదాల్లో 42 మంది మృతిచెందారని తెలిపారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 17 ప్రమాదాల్లో 52 మంది మృతిచెందారన్నారు. బాణసంచా కర్మాగారాల్లో సంభవించే అగ్నిప్రమాదాలు, విపత్తులపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే, నిబంధనలు తప్పక పాటించాలని కర్మాగారాల యజమానులకు సూచిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### తుపాకులతో 9 మంది అరెస్టు

అడయార్, అక్టోబరు 10: కరూర్ జిల్లాలో తుపాకులు కలిగిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. కరూర్ చిన్నటాంగో అనే ప్రాంతానికి చెందిన నిత్యానందం, రాయనూరు ప్రాంతానికి చెందిన ముకేష్ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య పాతకక్షలున్నాయి. అయితే, ముకేష్ అనుచరులు తనపై దాడి చేసేందుకు వస్తున్నాంటూ నిత్యానందం రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాయనూరు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ముకేష్, శోభన, రమ్య అనే వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు, చిన్నటాంగో ప్రాంతానికి చెందిన రంజిత్, గోపాల్, సెంథిల్, యువరాజ్, మూర్తి, బాలు అనే వారితో కలిసి దాడి చేసేందుకు ప్లాన్ చేసినట్టు వెల్లడించారు. దీంతో మొత్తం 9 మందిని అరెస్టు చేసి, వీరివద్ద ఉన్న తుపాకీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### బైకును ఢీకొన్న పాలవ్యాన్ : రైల్వే ఉద్యోగి మృతి



ప్రమాదస్థలం వద్ద గుమికూడిన స్థానికులు

చెన్నై, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా వాళప్పాడి వద్ద పాల వ్యాన్ ఢీకొని రైల్వే ఉద్యోగి మృతిచెందారు. అనుప్పూరు గ్రామానికి చెందిన దురైసామి (57) పెరియకృష్ణాపురం రైల్వే గేట్ వద్ద పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం డ్యూటీ ముగించుకుని బైకులో స్వగ్రామానికి వెళ్తుండగా తూక్కియంపాళయం బస్టాపు వద్ద ఎదురుగా వచ్చిన పాల వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దురైసామి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వాళప్పాడి పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.







వెలుగూ, వెన్నెలా మాత్రమే కాదు.. సకల జీవకోటికీ ప్రాణప్రదాతలు సూర్యచంద్రులు. ఆ ఇద్దరూ శ్రీనివాసుడిని మోసి, మాడవీధుల్లో తిప్పి పునీతులయ్యారు. బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజున ఉదయం సూర్యప్రభవాహనంపై వజ్రఖచిత శంకు చక్రాలు ధరించిన బద్రీనారాయణుడి రూపంలో స్వామి భక్తులను కటాక్షించాడు. రాత్రి దర్బారు కృష్ణుడి రూపంలో శ్రీనివాసుడు చంద్రప్రభపై ఊరేగాడు. ఈ వేడుకల్లో బిహూ, గురియో, దాండియా నృత్యాలు గురువారం విశేషంగా ఆకట్టుకున్నాయి.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

# ఆదిపురుషుడితడే!



## 'వేట్టయన్' కోసం ప్రేక్షకుడిలా విజయ్

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'వేట్టయన్' చిత్రం గురువారం విడుదలకాగా, ఈ చిత్రాన్ని చూసేందుకు మరో అగ్రహీరో విజయ్ థియేటర్‌కు వచ్చారు. ఈ సినిమా విడుదలైన తొలి రోజు తొలి ఆటను నగరంలోని దేవి థియేటర్‌లో ఆయన చూశారు. ఆయన థియేటర్‌కు వచ్చిన విషయం ఒక్కరికి కూడా తెలియదు. కానీ, వెళ్ళేటపుడు మాత్రం ప్రేక్షకులు పసిగట్టి, కారులో ఎక్కుతుండగా వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ విషయం వైరల్ అయింది. టోపీ, ముఖానికి మాస్క్ ధరించి, ఎవరూ గుర్తుపట్టని విధంగా విజయ్ థియేటర్‌కు వచ్చి 'వేట్టయన్' సినిమా చూసి వెళ్ళారు. కాగా, రాజకీయ పార్టీ స్థాపించిన విజయ్.. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఈ ఎన్నికల్లో లబ్ధిపొందేలా రజనీకాంత్‌కు ఫ్యాన్స్‌ను ఆకర్షించేందుకే విజయ్ థియేటర్‌కు వచ్చి 'వేట్టయన్' చిత్రాన్ని చూశారంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే, రజనీకాంత్ సతీమణి లత కూడా నగరంలోని ఓ థియేటర్‌లో సినిమా చూశారు. రజనీ అల్లుడు, హీరో ధనుష్ ఈ చిత్రం విడుదల సందర్భంగా 'తలైవర్ దర్శనం' అంటూ ట్వీట్ చేశారు.



రజనీకాంత్ - విజయ్



రజనీకాంత్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న అభిమానులు

మరోవైపు తమ అభిమాన హీరో చిత్రం విడుదలను పురస్కరించుకుని రజనీ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అనేక థియేటర్ల వద్ద హంగామా చేశారు. రజనీ కటౌట్లకు పాలాభిషేకాలు చేస్తూ, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సినిమాను చూసేందుకు రజనీ ఫ్యాన్స్ థియేటర్లకు క్యూ కట్టారు.



కారులో ఎక్కుతున్న దళపతి



నగరంలోని ఓ థియేటర్ వద్ద సూపర్‌స్టార్ అభిమానుల సందడి

## 'ఉదయం' సినీ కాంప్లెక్స్‌లో చివరి చిత్రం ఇదే...



చెన్నై మహానగరంలోని పాత సినిమా థియేటర్లలో ఉదయం సినిమాస్ ఒకటి. అశోక్ నగర్ కూడలి వద్ద ఉన్న ఈ థియేటర్ కాంప్లెక్స్ త్వరలో కనుమరుగుకానుంది. ఇక్కడ ప్రదర్శించే చివరి చిత్రం సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించి, గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన 'వేట్టయన్'. ఈ మూవీ ప్రదర్శన అనంతరం ఈ థియేటర్ నేలమట్టం చేసి, లగ్జరీ అపార్టుమెంట్ నిర్మించనున్నారు. నిజానికి ఈ సినిమా థియేటర్ కాంప్లెక్స్‌ను మూసివేస్తున్నట్టు కొన్ని నెలల క్రితమే ప్రకటించారు. కానీ, క్రయవిక్రయాలకు సంబంధించి లావాదేవీల్లో జాప్యం కారణంగా మూసివేతలో ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో 'వేట్టయన్'కు ప్రేక్షకాదరణ ఉన్నంతవరకు ఆ సినిమా ప్రదర్శించి, ఆ తర్వాత థియేటర్‌ను శాశ్వతంగా మూసివేయనున్నారు. 1983లో ప్రారంభించిన ఈ థియేటర్ కాంప్లెక్స్‌లో ఉదయం, సూరియన్, చందిరన్ అనే

చిత్రజ్యోతి

పేర్లతో మూడు స్క్రీన్లు ఉండగా 41 యేళ్ళుగా ప్రేక్షకులకు సినీ వినోదాన్ని అందించాయి. ఈ థియేటర్‌లో ప్రదర్శించిన తొలి చిత్రం 'శివప్పు సూరియన్'. ఇది కూడా రజనీకాంత్ నటించిన చిత్రమే కావడం యాదృచ్ఛికం. ఇపుడు ఇక్కడ ప్రదర్శించే చివరి చిత్రం రజనీకాంత్ నటించినదే కావడం గమనార్హం.

## 'సర్దార్-2' షూటింగ్ షురూ...

2022లో కార్తీ హీరోగా రాశీఖన్నా, రజీషా విజయన్ హీరోయిన్లుగా వచ్చిన 'సర్దార్' చిత్రానికి రెండో భాగం చిత్రీకరణ శరవేగంగా సాగుతుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత ఎస్ఆర్ ప్రభు తమ సొంత నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కించారు. ఇపుడు ఈ చిత్రానికి సీక్వెల్‌ను దర్శక నిర్మాతలు పక్కాగా ప్లాన్ చేసి సెట్స్‌పైకి తీసుకెళ్ళారు. ఇందులో ఎస్‌జే సూర్య కీలక పాత్ర పోషిస్తుండగా, హీరోయిన్లుగా మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ నటిస్తున్నారు. గత నెల నుంచి జోరుగా చిత్రీకరణ జరుపుకుంటుంది. చెన్నైలో నిర్మించిన భారీ సెట్‌లో ఈ షూటింగ్ జరుగుతుండగా, ముగ్గురు హీరోయిన్లకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇందులో హీరో కార్తీ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన విషయం తెల్సిందే.



ఆషికా రంగనాథ్



ప్రియా సిస్టర్స్‌తో నిర్వాహకులు

## నేత్రపర్వంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

● అలరించిన ప్రియ సిస్టర్స్ గానామృతం

ప్యారీస్, అక్టోబరు 10: స్థానిక అడయార్ గాంధీ నగర్‌లోని ప్రకృతి ఉమ్మిడి జ్యువెలరీ కార్యాలయంలో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. వేదిక ప్రాంగణాన్ని అరటి, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి గురువారం పసుపు పచ్చ పట్టు వస్త్రం, వజ్ర వైఢూర్యాలు, ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. విజయ దశమి, దసరాను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు అందర్నీ ఆకట్టుకుంటోంది. ప్రియా సిస్టర్స్‌గా గుర్తింపు పొందిన షణ్ముగప్రియ, హరిప్రియలు ఆత్మీయ అతిథులుగా హాజరై అన్నమయ్య కీర్తనలు, అమ్మవార్లను కీర్తిస్తూ కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. తొమ్మిది రోజులు చేపట్టిన వేడుకల్లో ప్రతిరోజు అమ్మవార్లకు వివిధ అలంకారాల సేవ, సంగీత మేళా, నాట్య ప్రదర్శన, అన్నప్రసాదాలు పంపిణి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉమ్మిడి ప్రశాంత్, కల్పన దంపతులు మాట్లాడుతూ... తమ కార్యాలయ ప్రాంగణంలో మూడేళ్లుగా విజయ దశమి పర్వదినం సందర్భంగా సంప్రదాయ సంస్కృతికి అద్దం పడుతూ నవరాత్రి వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. తొలి సంవత్సరం ప్రముఖ కర్ణాటక గాయని డా.నిత్యశ్రీ మహాదేవన్, రెండవ సంవత్సరం నాట్యవిదూషిణి డా.పద్మ సుబ్రమణ్యంలు పాల్గొన్నారని తెలిపారు.

## అమరజీవి భవనాన్ని సందర్శించండి

● ఏపీ మంత్రి దుర్గేశ్‌కు ఆహ్వానం

అడయార్, అక్టోబరు 10: చెన్నైలోని అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక భవనాన్ని దర్శించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌ను ద్రావిడ దేశం అధ్యక్షుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ కార్యదర్శి, కోశాధికారి వి.కృష్ణారావు కోరారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ఆయన మంత్రి దుర్గేశ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నైలోని అమరజీవి స్మారకభవాన్ని సందర్శించాలని ఆహ్వానించగా, నవంబరులో తప్పకుండా వస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు కృష్ణారావు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నై ట్రిప్లికేణిలోని మహాకవి భారతీయార్ స్మారక భవన నిర్వహణకు తమిళనాడు ప్రభుత్వం తగిన నిధులను కేటాయించి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తుందని, అదేవిధంగా అమరజీవి స్మారక భవనాన్ని కూడా అభివృద్ధి చేయాలని ఆయన మంత్రిని కోరారు. గత ఐదేళ్ళుగా తగినంత నిధుల కేటాయింపులు లేక భవన నిర్వహణ కష్టతరంగా మారిందని ఈ సందర్భంగా కృష్ణారావు గుర్తు చేశారు.



ఏపీ మంత్రి కందుల దుర్గేశ్‌ను అభినందిస్తున్న కృష్ణారావు

## చెన్నై పోర్ట్‌కు 'ఐఏపీహెచ్ సస్టైనబిలిటీ అవార్డు'

అడయార్, అక్టోబరు 10: కమ్యూనిటీ బిల్డింగ్ కేటగిరీలో చెన్నై పోర్ట్ "ఐఏపీహెచ్ సస్టైనబిలిటి 2024" అవార్డు గెలుచుకుంది. సమాజ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించిన చెన్నై పోర్ట్.. సాంప్రదాయ కార్యకలాపాలకు మించి వినూత్న కార్యక్రమాలను ఆచరించి, అంతర్జాతీయ స్థాయి నౌకాశ్రయంగా గుర్తింపు పొందింది. డబ్ల్యూపీఎస్‌పీ, ఐక్యరాజ్య సమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ)కు సహకరించడంలో పోర్ట్‌లను ఏకీకృతం చేసి నాయకత్వం వహించడాన్ని ఐఏపీహెచ్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విభాగాల్లో చెన్నై పోర్ట్ అగ్రగామిగా ఉండటంతో ఐఏపీహెచ్ సస్టైనబిలిటీ అవార్డు కైవసం చేసుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ అవార్డు కోసం 50కి పైగా పోర్టులు పోటీపడగా, చెన్నై పోర్ట్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును దక్కించుకుంది. ఈ నెల 9వ తేదీ బుధవారం నగరంలో జరిగిన వరల్డ్ పోర్ట్స్ కాన్ఫరెన్స్‌లో పోర్ట్ సెక్రటరీ ఇంద్రనీల్ హజ్రా ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా అన్ని విధాలుగా సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, చెన్నై పోర్ట్ అథారిటీ, చెన్నై నగర వాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని ప్రాచీన ప్రధాన ఓడరేవులలో ఒకటైన చెన్నై పోర్ట్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్, సస్టైనబుల్ గ్రోత్ చాంపియన్‌గా నిలిచింది. ఈ పోర్టును 1881లో స్థాపించగా, ఒకటిన్నర శతాబ్దాలుగా చెన్నై పోర్ట్ ప్రాంతీయ వృద్ధిని సాధించడంలోనూ, వాణిజ్యాన్ని ప్రోత్సహించి, వాణిజ్య కార్యకలాపాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.



అవార్డును స్వీకరించిన ఇంద్రనీల్ హజ్రా తదితరులు

## వీఐటీ వర్సిటీలో విద్యార్థుల కౌన్సిల్ ప్రారంభం

వేలూరు, అక్టోబరు 10: వేలూరు వీఐటీ యూనివర్సిటీలో 2024-25 విద్యార్థుల కౌన్సిల్ ప్రారంభ వేడుకలు గురువారం జరిగాయి. కార్యక్రమానికి వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, సెల్వం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమ కౌన్సిలింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ షర్మిల ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐపీఎస్ అధికారి ఆశ్రా ఖార్గ్ మాట్లాడుతూ... దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీల జాబితాలో వీఐటీ యూనివర్శిటీ 8వ స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను ఈ కౌన్సిల్‌కు తెలియజేయాలన్నారు. విద్యార్థులు చదువు ముగించి ఉద్యోగాలకు వెళ్లిన సమయంలోనూ ఈ కౌన్సిల్ సహాయంగా ఉంటుందన్నారు. వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. తమ వర్శిటీలో చదివిన విద్యార్థులు 84 దేశాల్లో ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. అలాగే, ప్రస్తుతం వర్శిటీలో 72 దేశాలకు చెందిన విద్యార్థులున్నారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ కాంచన, రిజిస్ట్రార్ జయభారతి సహా పలువురు పాల్గొన్నారు. విద్యార్థుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.




కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఐపీఎస్ అధికారి ఆశ్రా ఖార్గ్



చెన్నై నందనంలోని వాణిజ్యపన్నుల శాఖ ప్రధాన కార్యాలయంలో పట్టుకోట్టైకి చెందిన ఆ శాఖ మాజీ ఉద్యోగి సతీమణి సంతానలక్ష్మికి కుటుంబ సంక్షేమ ఫించనుగా రూ.3లక్షల చెక్కు అందజేస్తున్న ఆశాఖ మంత్రి పి.మూర్తి



చెన్నై అభిరామపురం కళ్యాణి అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటైన బొమ్మల కొలువు



చెన్నై పోరూరులో ఏర్పాటైన నవరాత్రి బొమ్మల కొలువును ఆసక్తిగా తిలకిస్తున్న సభ్యులు